అన్నదాతలకు కన్నీటి కష్టాలు

- కూటమి ప్రభుత్వంలో విత్తనాలు, ఎరువులకు ఇబ్బందులు
- ధాన్యానికి గిట్టుబాటు ధర ఎక్కడ..?
- ఎడగారు దిగుబడిపై సన్నగిల్లుతున్న ఆశలు
- నామమాత్రంగా రైతు సేవా కేంద్రాలు
- యూరియా బస్తా అడిగితే ఇవ్వరు
- వైఎస్సార్‌సీపీ అన్నదాత పోరు నేడు

వైఎస్సార్‌సీపీ హయాంలో విత్తనం నుంచి విక్రయం వరకు ఆర్బీకేలు ఎంతగానో ఉపయోగపడ్డాయి. ఈ – క్రాప్ బుకింగ్ ద్వారా రైతులు పంటలను గిట్టుబాటు ధరలకు అమ్ముకునే అవకాశం కల్పించారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక రైతులకు కష్టాలు మొదలయ్యాయి. రైతు సేవా కేంద్రాలు నిర్వీర్యమయ్యాయి. యూరియా కోసం కాళ్లరిగేలా తిరుగుతున్న పరిస్థితి ఉంది. ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ మంగళవారం అన్నదాత పోరు కార్యక్రమం చేపట్టింది.

పొదలకూరు: కూటమి ప్రభుత్వం కర్షకులను ఆదుకోవడంలో పూర్తిగా విఫలమైందనే విమర్శలున్నాయి. రైతు సేవా కేంద్రాల ద్వారా విత్తనాలు, ఎరువులు సక్రమంగా అందడం లేదని గగ్గోలు పెడుతున్నారు. ఎడగారులో సర్వేపల్లి నియోజకవర్గంలో సుమారు 30 నుంచి 35 వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. కొన్ని ప్రాంతాల్లో పంట కోత దశలో ఉంది. గతంలో ధాన్యం ఒక పుట్టి రూ.22 వేల నుంచి రూ.24 వేల వరకు పలికింది. ఎడగారు ధాన్యం అమ్ముకునేందుకు రైతులు ఆపసోపాలు పడాల్సి వస్తోంది. ప్రస్తుతం పుట్టి రూ.15,500ల నుంచి రూ.16 వేలు మాత్రమే చెల్లిస్తున్నారు. దీంతో వైఎస్సార్‌సీపీ రైతుల ప్రయోజనాలను కోరుతూ వారికి ప్రభుత్వం సాయం అందించాలని అన్ని రెవెన్యూ డివిజన్లలో అధికారులకు వినతిపత్రాలను అందజేయనుంది.



మనుబోలులోని రైతు సేవా కేంద్రం

యూరియా ఎక్కడ..?

యూరియా బస్తా అడిగితే ఎరువుల దుకాణం యజమానులు అనుబంధంగా నానో యూరియా లేదా 15:15:15, సల్ఫేట్, డీఏపీ వంటి ఏదో ఒకటి తీసుకుంటేనే అందజేస్తామంటున్నారు. నానో యూరియా రూ.230 కావడంతో తప్పనిసరి పరిస్థితుల్లో అవసరం లేకున్నా యూరియా బస్తాతోపాటు తీసుకుని ఇంట్లో పెట్టుకుంటున్నారు. మిగిలిన రసాయన ఎరువులను తీసుకోవాలంటే రూ.1,300, రూ.1,500 వరకు బస్తా ధర ఉండటంతో తీసుకోలేకున్నారు. యూరియా ఎమ్మార్పీ రూ.266.50 కాగా ఎరువుల దుకాణాల వారు అధిక ధరకు విక్రయిస్తున్నారు. ఒక్కోచోట ఒక్కోలా రైతుల నుంచి వసూలు చేస్తున్నారు. అవసరాన్ని బట్టి రూ.300 నుంచి రూ.400 కూడా తీసుకుంటున్నట్టు వెల్లడిస్తున్నారు. అయితే ఈ ప్రాంతంలో ప్రస్తుతం యూరియా అవసరం లేకున్నా ఉద్యాన పంటల సాగు చేస్తున్న రైతులకు స్వల్పంగానైనా కావాల్సి ఉంటుంది. ఎరువులు, విత్తనాలు అవసరమైన వారు ముందుగా రైతు సేవా కేంద్రాల ద్వారా నగదు చెల్లించాలి. అప్పుడే ఎరువులు దిగుమతి అవుతాయి. గత ప్రభుత్వంలో ప్రతి ఆర్బీకేకు ముందుగా ఎరువులు దిగుమతి చేసుకుని అవసరమైన రైతులకు అందజేసేవారు. ఇప్పుడు ఆ పరిస్థితుల్లేవు.


ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించమని వేడుకుంటున్న ముత్తుకూరు మండల రైతులు

సాయమేదీ..?

నియోజకవర్గంలో 30,242 మంది రైతులున్నారు. అన్నదాత సుఖీభవ సాయం ఇంకా చాలామందికి అందలేదని తెలుస్తోంది. వారు పొందాలంటే వ్యవసాయ శాఖ ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. పొదలకూరు, మనుబోలు, వెంకటాచలం మండలాల్లో మెట్ట పంటలైన మినుము, పెసర సాగు ఈ ఏడాది కూడా స్వల్పంగా రైతులు చేపట్టాలని చూస్తున్నారు. అయితే రాయితీపై విత్తనాలను అందజేయాల్సిందిగా కోరుతున్నారు. విస్తీర్ణం ఉంటేనే విత్తనాలు అందజేయడం జరుగుతుందని వ్యవసాయ శాఖ అధికారులు వెల్లడించారు. సాగు చేసుకుంటామని రైతులు వెల్లడిస్తే ఇండెంట్ పెట్టేందుకు అవకాశం ఉందని మెట్ట ప్రాంతంలో మినుము, పెసర పంటల సాగు పూర్తిగా తగ్గిపోయినట్టు అధికారులు వెల్లడించారు.

ఎరువులు అందడం లేదు



వ్యవసాయం చేయలేక అన్నదాత కుదేలవుతున్నాడు. పెట్టుబడులు బాగా పెరిగినా అందుకు తగిన విధంగా ధాన్యానికి ధరలు లభించడం లేదు. రైతు సేవా కేంద్రాల ద్వారా విత్తనాలు, ఎరువులు సక్రమంగా అందడం లేదు.

– శ్రీహరిరెడ్డి, రైతు, అక్కంపేట

గిట్టుబాటు ధర కల్పించాలి



ఎడగారులో పండించిన వరి ధాన్యానికి ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలి. రబీలో చాలా మంది ధాన్యాన్ని అమ్ముకునేందుకు ఇబ్బందులు పడ్డారు. పెట్టుబడులు పెరుగుతున్నా అందుకు అనుగుణంగా ధాన్యం ధరలు పెరగడం లేదు.

– కె.రమణారెడ్డి, రైతు, మహ్మదాపురం

అంతులేని వ్యథ

- అన్నదాతను నిలువునా మోసగిస్తున్న ప్రభుత్వం

కోవూరు: అన్నదాతను కూటమి ప్రభుత్వం నిలువునా మోసం చేస్తోంది. ఆరుగాలం శ్రమించి పండించిన పంటకు గిట్టుబాటు ధర లభించడంలేదు. కోవూరు సబ్ డివిజన్ పరిధిలో వరి సాగుపై ఆధారపడిన 4852 మంది రైతులు తీవ్ర అగచాట్లు పడుతున్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలేవీ..?

మద్దతు ధర కల్పిస్తామని ప్రభుత్వం హామీ ఇస్తున్నా, అది నామమాత్రమే. పంటలు కోసే సమయానికి కొనుగోలు కేంద్రాల్లేకపోవడం రైతులను కలవరానికి గురిచేస్తోంది. ఒకవేళ ఎప్పుడో ఏర్పాటు చేసినా, సిబ్బంది, తూకాలు తదితర సౌకర్యాలను కల్పించకపోవడంతో ధాన్యాన్ని విక్రయించలేకపోతున్నారు. రైతులను దళారులు దోచుకుంటున్నారు. పుట్టికి కనీసం రూ.మూడు వేల నుంచి రూ.ఏడు వేల వరకు తక్కువకు కొనుగోలు చేస్తున్నారు. తగిన గిడ్డంగులు, నిల్వ కేంద్రాలు కోవూరు పరిధిలో లేవు. దీంతో వర్షాలొస్తే అన్నదాతల పరిస్థితి అగమ్యగోచరంగా మారుతోంది. తమ సమస్యలను పరిష్కరించాలని అభ్యర్థిస్తున్నారు.


ధాన్యం బస్తాల లోడింగ్

ధాన్యం నిల్వకు సౌకర్యాలు లేకపోవడం దారుణం



రైతులపై ప్రభుత్వం వివక్ష చూపుతోంది. ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామని చెప్తున్నా, కాలయాపన చేస్తోంది. రైతుల బలహీనతను దళారులు దోచుకుంటున్నారు.

– అత్తిపల్లి అనూప్‌రెడ్డి, మండలాధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ

రైతుల ఆవేదన పట్టదా..?



రైతులు పడుతున్న కష్టాలు ప్రభుత్వానికి పట్టడంలేదు. కొనుగోలు కేంద్రాల్లేకపోవడంతో దళారులకు విక్రయించాల్సి వస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో రైతులెన్నో ఇబ్బందులు పడుతున్నారు.

– కలికి శ్రీధర్‌రెడ్డి, మండలాధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం

కాకాణిని కలిసిన కేఆర్‌ఆర్ నగర్ వాసులు



పొదలకూరు: మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డిని సోమవారం పట్టణంలోని కేఆర్‌ఆర్ నగర్‌కు చెందిన మహిళలు కలిశారు. ఈ సందర్భంగా వారు ఆయనకు శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో పొదలకూరు బిట్ – 1 ఎంపీటీసీ సభ్యురాలు షాకీరా బేగం, పార్టీ నాయకుడు ఎస్కే అంజాద్, సర్వేపల్లి అంగన్‌వాడీ విభాగం అధ్యక్షురాలు పి.శకుంతలమ్మ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

యోగాంజనేయస్వామి ఆలయంలో ప్రవచనలు



ఇందుకూరుపేట: కొత్తూరులోని యోగాంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ చాలీసాపై జ్ఞానయజ్ఞ ప్రవచనలను సోమవారం నిర్వహించారు. చిన్మయ మిషన్ 75 ఏళ్ల అమృత మహోత్సవంలో భాగంగా కొత్తూరు జీవీకే చిన్మయ విద్యాలయ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. చిన్మయ మిషన్, హైదరాబాద్ ఆచార్యుడు స్వామి సర్వేశానంద తదితరులు పాల్గొన్నారు.


ఆటోను ఢీకొట్టిన టిప్పర్

- ఒకరి పరిస్థితి విషమం


క్షతగాత్రులను అంబులెన్స్‌లో తరలిస్తూ..

ముత్తుకూరు(పొదలకూరు): మండలంలోని పోర్టు రోడ్డు జీరో పాయింట్ సమీపంలో రైల్వే గేటు వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కార్మికులు గాయపడ్డారు. స్థానికుల కథనం మేరకు.. వెంకటాచలం మండలం ఎగుమమిట్ట గ్రామం నుంచి పోర్టులో పనుల కోసం వెళుతున్న కార్మికుల ఆటోను టిప్పర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఏడుగురికి గాయాలు కాగా వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది క్షతగాత్రులను నెల్లూరు జీజీహెచ్‌కు తరలించారు.

విజేతలకు అభినందన



కొడవలూరు: నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో వైఎస్పీఏ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి వాలీబాల్, క్రికెట్ పోటీల్లో నార్తురాజుపాళెంలోని జీవనజ్యోతి జూనియర్ కళాశాల జట్లు ప్రథమ స్థానాల్లో నిలిచాయి. ఈ క్రమంలో వీరిని కళాశాలలో ప్రిన్సిపల్ అనిల్‌కుమార్, ఏఓ ఓబులేసు, పీఈటీ తేజ సోమవారం అభినందించి నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు.

ఆకట్టుకున్న క్రాఫ్ట్స్ మేళా



కొడవలూరు: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం ఏర్పాటు చేసిన క్రాఫ్ట్స్ మేళా ఆకట్టుకుంది. లోకాస్ట్, నోకాస్ట్ ఉపకరణాలు, పర్యావరణానికి హాని చేయని వస్తువులను విద్యార్థులు ప్రదర్శించారు. ఉత్తమ ఉపకరణాలను రూపొందించిన వారికి బహుమతులను హెచ్‌ఎం సత్యనారాయణ అందజేశారు. అనంతరం ట్రీస్ సేవ్ ది ఎర్త్ అనే అంశంపై విద్యార్థులకు చిత్రలేఖన పోటీలను ఏకలవ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించి విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. క్రాఫ్ట్ టీచర్ ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ విద్యా విధానంతో సమగ్రాభివృద్ధి

- వీఎస్‌యూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ సునీత

వెంకటాచలం: జాతీయ విద్యా విధానం విద్యార్థుల సమగ్రాభివృద్ధికి దోహద పడుతుందని విక్రమ సింహపురి యూనివర్సిటీ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత పేర్కొన్నారు. మండలంలోని కాకుటూరు వద్దనున్న వర్సిటీలో సోమవారం జాతీయ విద్యా విధానంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ విధానం కేవలం పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా నైపుణ్యాభివృద్ధి, పరిశోధన, సృజనాత్మకత తదితర అంశాలపై దృష్టి సారిస్తుందని తెలియజేశారు. అధ్యాపకులు ఈ మార్పులను స్వీకరించి విద్యార్థులను భవిష్యత్ సవాళ్లకు సన్నద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సీహెచ్ విజయ, జాతీయ విద్యా విధానం ప్రోగ్రాం నోడల్ అధికారిణి డాక్టర్ ఆర్.మధుమతి, తదితరులు పాల్గొన్నారు.


ర్యాలీని ప్రారంభిస్తున్న ఇన్‌చార్జి రిజిస్ట్రార్

'అన్నదాత పోరు'ను విజయవంతం చేయండి


నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి

కోవూరు: రైతులకు మద్దతుగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించనున్న అన్నదాత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ యువజన విభాగ కోవూరు నియోజకవర్గ అధ్యక్షుడు నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన మాట్లాడారు. నెల్లూరులోని వీఆర్సీ సెంటర్ నుంచి కలెక్టరేట్ వరకు నిరసన ర్యాలీని ఉదయం తొమ్మిది గంటలకు చేపట్టనున్నామని వివరించారు. కోవూరు నియోజకవర్గం నుంచి పార్టీ నేతలు, కార్యకర్తలు, రైతులు తరలిరావాలని కోరారు. కూటమి ప్రభుత్వ మెడలు వంచడమే తమ పార్టీ లక్ష్యమని తెలిపారు.

భారీగా తరలిరండి

అన్నదాత పోరు కార్యక్రమానికి భారీగా తరలిరావాలని రైతు విభాగ జిల్లా అధ్యక్షుడు శివుని నర్సింహారెడ్డి పిలుపునిచ్చారు. రైతుల సమస్యల పరిష్కారానికి పోరాటం చేస్తున్నామని, భారీగా హాజరుకావాలని కోరారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి

కొడవలూరు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నెల్లూరులో మంగళవారం నిర్వహించనున్న అన్నదాత పోరుకు పార్టీ శ్రేణులు భారీగా హాజరై విజయవంతం చేయాలని పార్టీ మండలాధ్యక్షుడు చిమటా శేషగిరి పిలుపునిచ్చారు. నార్తురాజుపాళెంలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. రైతుల సమస్యలను పరిష్కరించాలనే డిమాండ్‌తో కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని వివరించారు. రైతు విభాగ మండలాధ్యక్షుడు మారంరెడ్డి రంగారెడ్డి, పంచాయతీరాజ్ విభాగ రాష్ట్ర కార్యదర్శి అదపాల మోహనకృష్ణ, సేవాదళ్ మండలాధ్యక్షుడు దేవనబోయిన శివకుమార్, ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు తాటిపర్తి భాస్కర్, దొరబాబు పాల్గొన్నారు.


కొడవలూరు: మాట్లాడుతున్న శేషగిరిరావు

- **వెంకటాచలం:** రైతుల సమస్యలపై వైఎస్సార్‌సీపీ తలపెట్టిన అన్నదాత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నెల్లూరులో జరిగే కార్యక్రమంలో మండలంలోని నాయకులు, కార్యకర్తలు, రైతులు అత్యధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

అధిక మోతాదులో యూరియాను వాడొద్దు

ఇందుకూరుపేట: వరి సాగులో అధిక మోతాదులో యూరియా వినియోగం తగదని మండల వ్యవసాయాధికారి రఘునాథ్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ఇందుకూరుపేటలో సోమవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

⇨ **కోవూరు:** అధిక మోతాదులో ఎరువులను వినియోగిస్తే సంభవించే అనర్థాలపై అవగాహన సదస్సును ఇనమడుగులో నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ ఉప సంచాలకులు అనిత మాట్లాడారు. వ్యవసాయాధికారి రజని, సర్పంచ్ ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

⇨ **కొడవలూరు:** యూరియా వినియోగంపై రైతులకు అవగాహన అవసరమని వ్యవసాయాధికారి విజయలక్ష్మి పేర్కొన్నారు. ఎరువుల వినియోగంపై ఆలూరుపాడులో రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం అవగాహన ర్యాలీని నిర్వహించారు. సొసైటీ అధ్యక్షుడు బద్వేలు వినీల్‌రెడ్డి పాల్గొన్నారు.

⇨ **పొదలకూరు:** రైతులు అధిక మోతాదులో యూరియా వినియోగిస్తే అనర్థమేనని పొదలకూరు ఏడీఏ కె.శివనాయక్ అన్నారు. వ్యవసాయ శాఖ, ఆత్మ ఆధ్వర్యంలో మండలంలోని సూరాయపాళెం గ్రామంలో సోమవారం రైతులకు అవగాహన కల్పించారు. ఏఓ ప్రతాప్, ప్రకృతి వ్యవసాయం ఐసీఆర్పీ వెంకురెడ్డి, ఏఈఓలు రాజమోహన్‌రెడ్డి, ఏడుకొండలు నాయక్, ప్రణీత్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

⇨ **ముత్తుకూరు(పొదలకూరు):** మండలంలోని పాట్టింపాడు గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పించారు. ఏఓ జ్యోత్స్న రాణి మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయం కో–ఆర్డినేటర్ దశయ్య, నీటి సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి, ఏఈఓలు పాల్గొన్నారు.

⇨ **మనుబోలు:** మండలంలోని పిడూరు గ్రామంలో సోమవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి వెంకటకృష్ణయ్య రైతులతో కలిసి ర్యాలీ నిర్వహించారు.

ఆర్టీసీ బస్సు, ఆటోను ఢీకొన్న కారు

కొడవలూరు: ఆర్టీసీ బస్సుతో పాటు ఆటోను కారు ఢీకొన్న ఘటన మండలంలోని చంద్రశేఖరపురం వద్ద సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. ప్రమాదంలో కారు ముందు భాగం దెబ్బతినింది. ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. ఆటోలోని పురుగు మందులు చెల్లాచెదురయ్యాయి. ఘటనపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.



కౌన్సిల్ సమావేశం నేడు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశాన్ని మంగళవారం నిర్వహించనున్నామని కమిషనర్ బాలకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. చైర్‌పర్సన్ సుప్రజ ఆధ్వర్యంలో నిర్వహించనున్న సమావేశానికి కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు హాజరుకావాలని కోరారు.

ఉత్తమ టీచర్లకు సన్మానం నేడు

పొదలకూరు: మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులను మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సన్మానిస్తామని ఎంఈఓ – 1 రేణుక సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. టీచర్లు హాజరు కావాల్సిందిగా కోరారు.

బాబోయ్.. కుక్కలు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: పట్టణంలోని ఖాజానగర్ కోటేశ్వరరావు వీధిలో కుక్కల స్వైరవిహారం అధికమవుతోంది. ఫలితంగా బయట తిరగాలంటేనే స్థానికులు జంకాల్సిన పరిస్థితి ఏర్పడింది. కుక్కల దాడిలో ముగ్గురు చిన్నారులు ఇటీవల గాయపడ్డారు. సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: ప్రకృతి వ్యవసాయాన్ని ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని తహసీల్దార్ అంబటి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో వివిధ ప్రకృతి ఉత్పత్తులను సోమవారం ప్రదర్శించారు.

పోస్టర్ల ఆవిష్కరణ



పొదలకూరు: పట్టణంలోని శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి శరన్నవరాత్రి మహోత్సవాల పోస్టర్లను సోమవారం దేవస్థాన నిర్వాహకులు ఆవిష్కరించారు. ఈనెల 22 నుంచి అక్టోబర్ 5వ తేదీ వరకు ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తామని అధ్యక్షుడు వాకాటి రాఘవేంద్రరావు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు ఆమర్తలూరు చెంచయ్య, ఎ.విజయకుమార్, జె.బ్రహ్మయ్య, పి.సుధాకర్, టి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణులకు వరం 'ఫ్యామిలీ డాక్టర్'



కొడవలూరు: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం గ్రామీణులకు వరమని కొడవలూరు పీహెచ్‌సీ వైద్యాధికారి బాలచంద్రబాబు పేర్కొన్నారు. మండలంలోని రామన్నపాళెంలో సోమవారం నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో పలువురికి వైద్య పరీక్షలు చేసి మందులను అందజేశారు. హెచ్‌ఎస్ రామ్మోహన్, హెచ్‌ఏ షఫీఉద్దీన్, ఎమ్మెల్‌హెచ్‌పీ మాబ్జానీ తదితరులు పాల్గొన్నారు.

కాలేజీకి కంప్యూటర్ వితరణ

పొదలకూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీకి 1986 – 88 బ్యాచ్ విద్యార్థులు కంప్యూటర్, టేబుల్‌ను సోమవారం అందజేశారు. వాటిని కాలేజీ ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణకు పూర్వ విద్యార్థుల తరఫున వీవీ మురళీకృష్ణ ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ దేశ, విదేశాల్లో ఉన్న పూర్వ విద్యార్థులు రూ.66 వేల విలువైన సామగ్రిని అందజేయడం సంతోషంగా ఉందన్నారు. మురళీకృష్ణ మాట్లాడుతూ శారద, అరుణ, సుధారాణి, శ్రీలక్ష్మి, మంజువాణి, శ్రీకాంతమ్మ, వెంకటేశ్వర్లు, సురేష్, జాకీర్, కృష్ణ, శ్రీధర్‌బాబు, రమేష్ కలిసి కంప్యూటర్‌ను పంపినట్టు చెప్పారు.


కంప్యూటర్ అందిస్తూ..

తహసీల్దార్ కార్యాలయ ఎదుట నిరసన

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: వాహనమిత్ర పథకాన్ని అమలు చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి మల్లికార్జునరావు డిమాండ్ చేశారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయ ఎదుట నిరసనను సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం చేపట్టారు. తహసీల్దార్ అంబటి వెంకటేశ్వర్లుకు వినతిపత్రాన్ని అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. ఈ పథకాన్ని వెంటనే అమలు చేసి, లైసెన్స్ ఉన్న ప్రతి ఆటో కార్మికుడికి రూ.25 వేలను ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ నేత రాధయ్య, ఆటో కార్మిక సంఘ నేతలు మాల్యాద్రి, సునీల్, రాహుల్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



సంపూర్ణ అక్షరాస్యతతోనే దేశాభివృద్ధి

విడవలూరు: సంపూర్ణ అక్షరాస్యతతోనే దేశాభివృద్ధి సాధ్యమని వయోజన విద్య జిల్లా నోడల్ అధికారి మల్లు మస్తాన్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవంలో ఆయన మాట్లాడారు. కోవూరు నియోజకవర్గంలోని 21 వేల మందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్ది.. వచ్చే ఏడాది మార్చి నాటికి సంపూర్ణ అక్షరాస్యత కోవూరుగా ప్రకటించేలా ప్రణాళికలను సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు. అనంతరం విద్యార్థులతో కలిసి గ్రామంలో అవగాహన ర్యాలీని నిర్వహించి మానవహారాన్ని ఏర్పాటు చేశారు.


విడవలూరులో ర్యాలీ

21 నుంచి ప్రత్యేక ఆధార్ కేంద్రాలు

మనుబోలు: సర్వేపల్లి నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఈనెల 21వ తేదీ నుంచి గిరిజనులకు ప్రత్యేక ఆధార్ కేంద్రాలు ప్రారంభిస్తామని ఐటీడీఏ అడిషనల్ పీఐఓ మస్తాన్ తెలిపారు. సోమవారం ఆయన మనుబోలులో తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీఓ జలజాక్షిని కలిసి చర్చించారు. అన్ని సచివాలయాల్లో ఈనెల 21 నుంచి 27వ తేదీ వరకూ ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఆధార్ లేని వారందరూ ఈ కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని సూచించారు. ఐదేళ్ల వయసు లోపు చిన్నారులకు తప్పనిసరిగా బర్త్ సర్టిఫికెట్ అవసరమన్నారు. గిరిజనులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


తహసీల్దార్‌తో మాట్లాడుతున్న పీఐఓ మస్తాన్

పొలానికి దారి మూసేశారమ్మా..

కొడవలూరు: పొలానికి వెళ్లనీయకుండా గేటు పెట్టారని యల్లాయపాళేనికి చెందిన గిరిజన రైతు చలంచర్ల సంజీవయ్య వాపోయారు. ఈ మేరకు తహసీల్దార్ స్ఫూర్తిరెడ్డికి వినతిపత్రాన్ని సోమవారం అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. పొలమున్న రైతు గేటు పెట్టేయడంతో తన పొలంలోకి దారి లేకుండాపోయిందని చెప్పారు. సాగు చేయలేక తీవ్రంగా నష్టపోతున్నానని వాపోయారు. కాగా ఘటన స్థలానికి వచ్చి పరిశీలించి దారి ఏర్పాటుకు చర్యలు చేపడతామని తహసీల్దార్ హామీ ఇచ్చారు.


తహసీల్దార్‌కు వినతిపత్రమిస్తున్న రైతు సంజీవయ్య